క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



అలంపూర్: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వార మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అలంపూర్ మండలం ఉట్కూరు గ్రామానికి చెందిన రాములమ్మకు సీఎం సహాయ నిధి ద్వార రూ. 28,500, అయిజ మండల ఉప్పల గ్రామానికి చెందిన పర్వీన సుల్తానకు రూ.12 వేల చెక్కు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ శేఖర్ రెడ్డి, వావిలాల రంగారెడ్డి, రాజన్న, పెద్ద మోక్తార్, శ్రీనివాస్ రెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కేటీదొడ్డి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీసీ తిమ్మక్క అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారులకు విక్రయించి మోసాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్కశేఖర్, రాజేష్, తిమ్మారెడ్డి, సెంటర్ నిర్వాహకులు గోవిందు రెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల, మద్దూరు, ఏ.బుర్దిపాడు గ్రామాల్లో శనివారం ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మీనా ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి శిశువు నుంచి 5ఏళ్ల వరకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, పుష్పలత, ఆశాలు పావని, హేమలత వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం శనివారం 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఇన్వర్టర్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్ఎం మంజులత, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్, వరలక్ష్మి, అలేఖ్య, నరసింహ, పర్వతాలు, రవి కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

ధరూరు: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత అన్నారు. మండల పరిధిలోని కోరుకొండయ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. క్రీడాకారులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. గద్వాల ప్రాంతానికి క్రీడలతో మరింత గుర్తింపు తీసుకు వచ్చేందుకు క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. క్రీడల కోసం గద్వాలకు ప్రత్యేక నిధులు తీసుకు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. భక్తులకు, క్రీడాకారులకు జాతర శుభాకాంక్షలు తెలియజేశారు. కోరుకొండయ్య శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దయ ఈ ప్రాంత ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్, సీసల్ వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, కపట్రాల వెంకట్‌రెడ్డి, నిర్సంహులు, పరుశరాం, ప్రహ్లాద్, ఈశ్వర్, జంగిలప్ప, నల్లారెడ్డి, సురేష్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో..

మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం



ధరూరులో సభ్యత్వాలు నమోదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధరూరు: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కురువ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మొబైల్‌లో యాప్ ద్వారా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ఎలాంటి పథకాలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో రాములు, శ్రీనివాసులు, మాజీ, పరుశరాం, మహబూబ్, గోసి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు..

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మొబైల్ యాప్ ద్వారా మహిళలకు సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం దిశగా మహిళలు సభ్యత్వాలు వేగవంతం చేయాలని కోరారు. మహిళల అభ్యున్నతికి పార్టీ, ప్రభుత్వం తోడ్పాటు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో గోవిందు, విజేంద్ర, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని ఎన్యూమరేటర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఆదాయం, రాజకీయ నేపథ్యం తదితర వివరాలు సేకరించారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్యూమరేటర్లు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఒకే ఇంట్లో ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ అన్నదమ్ములు నివసిస్తుంటే వారు వేరు వేరుగా వంట చేసుకుంటే వారి వివరాలను విడి విడిగా నమోదు చేసుకున్నారు.

నిరక్షరాస్యుల గుర్తింపునకు సర్వే



జోకన్‌గట్టులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



శ్రీరంగాపురంలో సర్వే చేస్తున్న అధికారులు

గట్టు: నవ భారత్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శనివారం జోకన్‌గట్టు గ్రామంలో నిరక్షరాస్యులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఎస్ఐఎల్‌పీ స్టే కోఆర్డినేటర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా నిరక్షరాస్యులైన వారిని గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓలు నల్లారెడ్డి, సురేష్, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్ వెంకట్రాములు, సీఆర్‌పీలు శ్రీధర్, రమేష్, నర్సింహులు, హెచ్ఎం రాముడు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: నిరక్షరాస్యుల ఇంట అక్షర కాంతులు ప్రసరింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని స్టేట్ కోఆర్డినేటర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. నవభారత అక్షరాస్యతలో భాగంగా మండలంలోని పైలట్ గ్రామం శ్రీరంగాపురంలో ఇంటింటి సర్వే శనివారం నిర్వహించారు. గ్రామంలోని నిరక్షరాస్యుల సంఖ్య.. పురుషులు, మహిళలు ఇతరులు ఎంత మంది ఉన్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారికి విద్య నేర్పించే కార్యక్రమం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు సురేష్, నల్లారెడ్డి, రిసోర్స్ పర్సన్ కృష్ణ, సీఆర్‌పీ పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



కేటీదొడ్డి: మండల పరిధిలోని కుచినెర్ల గ్రామ శివారులోని చెరువులో భారత్ మాల రోడ్డు నిర్మాణం కోసం అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సర్వే నంబర్ 108లో భారత మాల రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు జేసీబీ ద్వారా మట్టి తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ సాహెదాబేగం వివరణ కోరగా..చెరువులో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే పనులు నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: పట్టణంలో మెరుగైన విద్యుత్ సరఫరాకు చెట్ల కొమ్మల కత్తరింపు కార్యక్రమం కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగనున్నట్లు ఏఈ నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భరత్ నగర్, కొత్త బస్టాండ్, దేవనగర్, టీచర్స్ కాలనీ, గాజులపేట, తెలంగాణ చౌరస్తా, వెంకటరమణ కాలనీ, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

మల్దకల్: చదువుతూ మధ్యలో బడి మానేసిన పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ తల్లిదండ్రులను కోరారు. శనివారం మల్దకల్ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన సాగించాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తేనే చదువుపై విద్యార్థులకు శ్రద్ధ పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో బడి మానేసిన విద్యార్థుల ఇళ్లకు ఇన్‌చార్జి ఎంఈఓ, ఉపాధ్యాయులు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్‌పీ నాయకులు

వనపర్తిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమెరికా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3.50 కోట్ల మంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉన్నారని.. వారందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని అన్నారు. భూమిలేని ప్రతి నిరుపేదకు ఎకరా భూమి ఇచ్చి అండగా నిలవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, కుర్మన్న, బలరాం, లక్ష్మణ్, ఆంజనేయులు ఉన్నారు.

విద్యతోపాటు నాణ్యమైన భోజనం



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పాగుంట, ఈర్లబండ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘు, నాయుమా, సునీత, సీఆర్‌పీ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



జిల్లెడుదిన్నెలో పశువుల వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



తప్పెట్లమొర్సులో పశుగణన చేస్తున్న అధికారులు

గట్టు: పశు సంపద వివరాలు పూర్తి స్థాయిలో రైతులు ఎన్యూమరేటర్లకు అందించాలని, గణనకు సహకరించాలని పశువైద్యాధికారులు వరలక్ష్మీ, శంకరయ్యలు కోరారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం శనివారం తప్పెట్లమొర్సు గ్రామంలో పశు వైద్యాధికారిణి వరలక్ష్మీ ప్రారంభించారు. పశుగణన ఈ నెల 16 నుంచి 2025 ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల పశువుల సంఖ్యను నమోదు చేసుకుని, ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు వరలక్ష్మీ సూచించారు. మాచర్ల గ్రామంలో పశువైద్యాధికారి శంకరయ్య ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పశుగణనపై పలు సూచనలు చేశారు. అనంతరం పశుగణనకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రియాంక, కనకరాజు, పృథ్వీరావు, వీఏ ఖాజా, ఓస్ భీమయ్య పాల్గొన్నారు.

శాంతినగర్ : పశు సంపదకు సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వైద్య సిబ్బందికి సహకరించాలని శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత కోరారు. వడ్డేపల్లి పుర పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్, మండల పరిధిలోని కొంకల, జిల్లెడుదిన్నె, జూలెకల్ గ్రామాల్లో శనివారం పశుగణన కార్యక్రమం ప్రారంభించారు. పశు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జీవాల వివరాలు నమోదు చేశారు. పశు సంపదకు చెందిన వివరాలతో భవిష్యత్తులో వాటికి సంబంధించిన టీకాలు, మందులు, వైద్య సేవలకు సౌకర్యంగా ఉంటుందని రైతులు, యజమానులకు డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, రవి, కార్తీక్, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ పోరాటాలకు మద్దతివ్వాలి



వీపనగండ్ల: మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చేపడుతున్న పోరాటాలకు అందరూ మద్దతు తెలుపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి కోరారు. శనివారం మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 1న మాలల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు మాలలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిజ్జ బాబురావు, ఉపాధ్యక్షుడిగా శికపూర్, ప్రధాన కార్యదర్శిగా వడ్డెమాన్ నరేష్, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా బండారి రంగస్వామి, ఇన్‌చార్జిగా ఆంజనేయులు, కమిటీ కోఆర్డినేటర్‌గా విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

పాన్‌గల్: డ్రగ్స్‌ను నిర్మూలించి, సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి 'డ్రగ్స్ నిర్మూలిద్దాం – సమాజాన్ని కాపాడుదాం' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహనీయులను స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ కమలాకర్, భీమయ్య, రాము, హెచ్‌సీ రోశయ్య పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారం గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పాన్‌గల్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ముడావత్ కిషోర్ శనివారం వనపర్తి నుంచి బిజినేపల్లివైపు బైక్ పై వెళ్తూ.. బుద్ధారం సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ముడావత్ కిషోర్ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.